క్లుప్తంగా

ఎస్పీకి మహారుద్రాభిషేకం ఆహ్వాన పత్రిక అందజేత



ఎస్పీకి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నిర్వహణ కమిటీ సభ్యులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఎస్‌ఎస్‌పీ క్యాంప్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 27న నిర్వహించనున్న మహా రుద్రాభిషేకానికి హాజరు కావాలని కోరుతూ మంగళవారం జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్‌కు నిర్వహణ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జి.ప్రభాకర్, పి.నరసింహారావు, వి.నాగేశ్వరరావు, వై.విజయ్, కె.మల్లికార్జున్, కె.అశోక్, జి.శ్రీనివాస్, బి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నడిగూడెం : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీసు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నడిగూడెం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు విచక్షణతో కూడిన మొబైల్ ఫోన్ వాడకంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఎస్‌ఐ జి.అజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఏ.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



ఎరువుల దుకాణంలో రికార్డులు తనిఖీ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

మునగాల : ఎరువులు, క్రిమి సంహారక మందులు, విత్తనాల అమ్మకాల్లో డీలర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని వ్యవసాయ శాఖ కోదాడ డివిజన్ సహాయ సంచాలకుడు డి.ఎల్లయ్య కోరారు. మంగళవారం మునగాల మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుకాణాల్లో రికార్డులు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఎమ్మార్పీ ధరకన్నా ఎక్కువ అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఓ బుంగా రాజు, డీలర్లు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ చైర్మన్ రామారావుకు సన్మానం



రామారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మల్లికార్జున్


హుజూర్‌నగర్ : జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన వంగవీటి రామారావును మంగళవారం కాంగ్రెస్ పార్టీ హుజూర్‌నగర్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జునరావు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ కోడి ఉపేందర్‌యాదవ్‌లు సన్మానించారు. కోదాడలోని రామారావు నివాసంలో కలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల ఫోరం అధ్యక్షుడిగా ఇంద్రబాబు



గరిడేపల్లి : పంచాయతీ కార్యదర్శుల ఫోరం (టీఎన్‌జీఓ అనుబంధ సంఘం) సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన పిడమర్తి ఇంద్రబాబు ఎన్నికయ్యారు. మంగళవారం సూర్యాపేటలోని టీఎన్‌జీఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. కాగా, పిడమర్తి ఇంద్రబాబు ప్రస్తుతం గరిడపల్లి మండలం గానుగబండ పంచాయతీ సెక్రటరీగా పని చేస్తున్నారు.

అసోసియేట్ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు



తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫోరం (టీఎన్‌జీఓ అనుబంధ సంఘం) జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా గుగులోతు నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. నాగేశ్వరరావు ప్రస్తుతం గరిడేపల్లిలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

విద్యుత్ మోటార్లు చోరీ

నడిగూడెం: మండల కేంద్రం సమీపంలోని సాగర్ ఎడమ కాల్వపై పలువురు రైతులకు చెందిన నాలుగు విద్యుత్ మోటార్లను సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. నడిగూడెం గ్రామానికి చెందిన ఎలకా వెంకట్‌రెడ్డి, దున్నా రత్నకుమారి, కృష్ణానగర్‌కు చెందిన సురగాని లింగయ్య, జూకంటి వెంకయ్యకు చెందిన మోటార్లు చోరీకి గురయ్యాయి. బాధితులు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నాన్ ఆయకట్టుకు కూలీల బాట

- ఆయకట్టులో దొరకని పనులు
- నాన్ ఆయకట్టులో పత్తి తీసేందుకు వెళ్తున్న వ్యవసాయ కూలీలు
- నిత్యం ఆటోలు, ట్రాలీల్లో ప్రమాదకరమైన ప్రయాణం

మునగాల : వ్యవసాయ కూలీలకు స్థానికంగా పనులు దొరకడం లేదు. దీంతో కూలి కోసం ఊరు దాటి నాన్ ఆయకట్టుకు వెళ్తున్నారు. మోతె, పెన్‌పహాడ్, చివ్వెంల మండలాల్లో పత్తి, మిర్చి పంటల పనులకు వెళ్తున్నారు. మండలం నుంచి ప్రతిరోజూ 60 ఆటోలు ఇతర మండలాలకు కూలీలను తరలిస్తున్నాయి. ఆటోల్లో నిత్యం కిక్కిరిసి వెళ్తున్నారు. వాహనాల్లో ప్రమాదకరమైన ప్రయాణం చేయాల్సి వచ్చినా కూలి కోసం తప్పడం లేదని వ్యవసాయ కూలీలు అంటున్నారు.

నాన్ ఆయకట్టులో వాణిజ్య పంటలు..

కాగా, గతంలో నాన్ ఆయకట్టు గ్రామాల నుంచి వ్యవసాయ కూలీలు జీవనోపాధి కోసం ఆయకట్టు ప్రాంతానికి వలస వచ్చేవారు. కానీ నేడు ఆయకట్టు ప్రాంత వ్యవసాయ కూలీలు పనుల కోసం నాన్ ఆయకట్టు గ్రామాలకు రోజువారి కూలి కోసం వెళ్తున్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో నాన్ ఆయకట్టులో మిర్చి, పత్తి లాంటి వాణిజ్య పంటలు సాగవుతున్నాయి. కానీ ఆయా గ్రామాల్లో కూలీల కొరత ఏర్పడింది. దీంతో రైతులు కూలీల కోసం ఆయకట్టు గ్రామాల వైపు దృష్టి సారించారు. ప్రస్తుతం ఆయకట్టు గ్రామాల్లో ఖరీఫ్ సీజన్‌లో ఎక్కువ శాతం వరి పంటలు సాగు చేయడంతో కూలీల అవసరం అంతగా లేదు. వరినార్లు, కలుపుతీత పనులు, మందుల పిచికారీ లాంటి పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. మరో నెల వరకు ఆయకట్టులో కూలీలకు ఎలాంటి పనులు లేవు. దీంతో నాన్ ఆయకట్టు గ్రామాల్లో పత్తి దూసేందుకు వెళ్తున్నారు.



కూలి కోసం ఇతర మండలాలకు ఆటోలో తరలివెళ్తున్న కూలీలు

ప్రతిరోజూ 500 మందికి పైగా..

పత్తి రైతులు ఆయకట్టు గ్రామాల నుంచి ఆటోల ఖర్చులు భరించి వ్యవసాయ కూలీలను తీసుకువెళ్తున్నారు. ఒక్కొక్కరికి కేజీ పత్తికి రూ.11 చొప్పున కూలి ఇస్తుండడంతో కూలీలు పత్తి ఏరేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో ఒక్కొక్కరికి రూ.600లకు పైగా కూలి లభిస్తుంది. మండలంలోని ఏడెనిమిది గ్రామాల నుంచి నిత్యం 500 మందికి పైగా వ్యవసాయ కూలీలు పనుల నిమిత్తం నాన్ ఆయకట్టు గ్రామాలకు ఆటోల్లో వెళ్లి వస్తున్నారు. కాగా, మరో నెలరోజుల పాటు నాన్ ఆయకట్టు గ్రామాల్లో వ్యవసాయ కూలీలకు పనులు దొరికే అవకాశముంది.

నిత్యం పనులు దొరుకుతున్నాయి

మా ఊరిలో గత నెలరోజులుగా పనులు దొరకడం లేదు. దీంతో పత్తి తీసేందుకు ఇతర గ్రామాలకు ఆటోల్లో వెళ్తున్నాం. మాకు నిత్యం పనులు దొరుకుతుండడంతో జీవనోపాధి లభిస్తుంది.

– రాములమ్మ, కొక్కిరేణి,

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



నడిగూడెంలో కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే గోపాల్

నడిగూడెం : లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని సూర్యాపేట మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దృష్టి లోపం ఉన్న వారికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఉప్పల రాజేంద్రప్రసాద్, ఏఓ పటేల్ నర్సింహారెడ్డి, జి.వెంకటరెడ్డి, లక్ష్మారెడ్డి, రవీందర్‌రెడ్డి, టెక్నీషియన్ పవన్‌కుమార్, ప్రిన్సిపాల్ డి.విజయనాయక్, ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాసరావు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ధరలు తగ్గించాలని సీపీఎం ధర్నా

మునగాల : కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన నిత్యావసర వస్తువుల ధరలను తక్షణమే తగ్గించాలని మంగళవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యుడు దేవరం వెంకటరెడ్డి, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి శ్రీరాములు మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు వానాకాలం రైతు భరోసా నిధులను విడుదల చేయాలని, రూ.రెండు లక్షల రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శివర్గ సభ్యులు బచ్చలకూరి స్వరాజ్యం, కమిటీ సభ్యులు దేశిరెడ్డి స్టాలిన్ రెడ్డి,, కృష్ణారెడ్డి, తుమ్మ సతీష్, జానయ్య, డీవైఎఫ్‌ఐ మండల కార్యదర్శి గడ్డం వినోద్, పేరెల్లి వెంకన్న, గడ్డం వెంకన్న పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఎమ్మెల్సీ ఓటు నమోదుపై అవగాహన

నేరేడుచర్ల : పీఆర్టీయూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగలి శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు యడవల్లి సత్యనారాయణరెడ్డి కోరారు. మంగళవారం నేరేడుచర్ల మండలంలోని చిల్లేపల్లి గ్రామ సమీపంలో గల మహాత్మా జ్యోతిరావ్‌పూలే బాలికల గురుకుల పాఠశాలలో పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదుపై అవగాహన కల్పించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చల్లా ప్రభాకర్‌రెడ్డి, కట్టా శ్రీనివాస్‌రెడ్డి, మాతంగి సైదులు, రమావత్ దిప్లానాయక్, వెంకట్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు ఆదిలక్ష్మి, సంధ్య, సుజాత, మేరీ, రమ్య, స్వాతి తదితరులు ఉన్నారు.



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదుపై అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణరెడ్డి

బీమా రంగంలో మార్పులపై అవగాహన ఉండాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న భానుకుమార్

కోదాడరూరల్ : బీమా రంగంలో కేంద్రం ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన మార్పులపై ఏజెంట్లు అవగాహన కలిగి ఉండాలని ఎల్‌ఐసీ కోదాడ బ్రాంచ్ సీనియర్ మేనేజర్ భానుకుమార్ అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలో లియాఫీ కార్యాలయంలో నూతన మార్పులపై ఏజెంట్లకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీకేవైసీ, అనంద యాప్ వంటి నూతన టెక్నాలజీపై ప్రాజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లియాఫీ సంఘం నాయకులు, ఏజెంట్లు ఉన్నారు.

నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీతో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణ నాయీ బ్రహ్మణ సేవా సంఘం నూతన కమిటీని పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో సంఘం పెద్దల సమక్షంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆలేటి గోపి, ఉపాధ్యక్షులుగా పిన్నెల్లి మురళి, వినకొల్లు శ్రీను, ప్రధాన కార్యదర్శిగా సన్నాయిల వీరబాబు, గౌరవ అధ్యక్షుడిగా గుడిమల్ల శ్రీహరిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎన్నికైన నూతన కార్యవర్గం రెండు సంవత్సరాలు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు సురభి నర్సయ్య, ఆలేటి సత్యనారాయణ, తాడేపల్లి గోవిందరావు, పాలూరి సత్యనారాయణ, ఆలేటి చిన్న సత్యనారాయణ ఉన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బాలమ్మ



మునగాల శాఖ గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బాలమ్మ

మునగాల: గ్రంథాలయాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.బాలమ్మ కోరారు. మంగళవారం మునగాలలోని శాఖా గ్రంథాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మునగాల మండలం మాధవరం, విజయరాఘవపురం, రేపాల గ్రామాల్లో దాతల సహకారంతో నిర్మించిన రీడింగ్ రూమ్స్‌కు కల్పించిన వసతులను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయాధికారిణి దేవబత్తిని లలితాదేవి పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం

నేరేడుచర్ల : బలమైన ప్రజా ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం నేరేడుచర్ల పట్టణంలో నిర్వహించిన హుజూర్‌నగర్, కోదాడ డివిజన్ సీపీఐ (ఎంఎల్) పార్టీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వారంలో రెండు సార్లు ఢిల్లీ యాత్రలు చేస్తూ ప్రజా సమస్యలను గాలికొదిలేశాడని విమర్శించారు. పార్టీ నేత వాసా పల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి కోత్తపల్లి శివకుమార్, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్, పేర్ల నాగయ్య, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, పీవైఎల్ జిల్లా నాయకుడు వాసా కరుణాకర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి



కరివిరాల మోడల్ స్కూల్‌లో ఎస్‌ఏ- 1 పరీక్షను పరిశీలిస్తున్న విద్యాధికారి ఉపేందర్‌రావు

నడిగూడెం : విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని మండల విద్యాధికారి బి.ఉపేందర్‌రావు కోరారు. మంగళవారం నడిగూడెం మండలంలోని కరివిరాల మోడల్ స్కూల్‌తో పాటు ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరు రిజిస్టర్లు, పాఠశాలల రిజిస్టర్లను, మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు నిర్వహిస్తున్న ఎస్‌ఏ–1 పరీక్షలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట సీఆర్‌పీ నాగార్జున్, ఉపాధ్యాయులు ఉన్నారు.

దివ్యాంగులకు 50 శాతం రాయితీతో బస్‌పాస్‌లు

హుజూర్‌నగర్ : అర్హులైన దివ్యాంగులకు 50 శాతం రాయితీతో కూడిన బస్‌పాస్‌లు అందజేస్తున్నట్లు బస్‌పాస్ ఇన్‌చార్జ్ అబ్దుల్ తెలిపారు. హుజూర్‌నగర్‌లోని పాత బస్టాండ్‌లో కోదాడ ఆర్‌టీసీ డిపో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దివ్యాంగుల బస్‌పాస్ మేళా మంగళవారం ముగిసింది. ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు 30 మందికి రాయితీ బస్‌పాస్‌లు అందజేసినట్లు తెలిపారు. బుధవారం మఠంపల్లిలోని ఎంపీపీ కార్యాలయంలో బస్‌పాస్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని వినతి

నడిగూడెం : ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు మంగళవారం నడిగూడెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రూ.4500 కోట్ల ఫీజులు బకాయి ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం తహసీల్దార్ సరితకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వంశీ, శ్రీధర్, శ్రీపతి, యశ్వంత్, లింగానాయక్, బన్నీ, గణేష్, గోపి, నాగరాజు, వరుణ్, పాల్గొన్నారు.

రైతు భరోసా అమలు చేయాలి

నేరేడుచర్ల : ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు దూళిపాల ధనుంజయనాయుడు అన్నారు. మంగళవారం నేరేడుచర్లలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రజలు సమస్యలను తెలుసుకునేందుకు జిల్లా మంత్రి హుజూర్‌నగర్‌లో ప్రతి సోమవారం ప్రజాదర్బార్ ఏర్పాటు చేయాలన్నారు. మండల, పట్టణ కార్యదర్శులు యల్లబోయిన సింహాద్రి, కత్తి శ్రీనివాస్‌రెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీను, వెంకట్ ఉన్నారు.

జమిలి ఎన్నికల సిఫార్సులను ఉపసంహరించుకోవాలి

హుజూర్‌నగర్ : పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు, స్థానిక సంస్థలకు ఏకకాలంలో ఎన్నికలు (జమిలి ఎన్నికలు) జరగాలన్న రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సిఫార్సులను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.పాండు అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం నాయకులు పల్లె వెంకటరెడ్డి, దుగ్గి బ్రహ్మం, లక్ష్మీనరసింహా, హుస్సేన్, సైదులు, శీలం శ్రీను, ఖాసీం, భిక్షం, నరసింహాచారి పాల్గొన్నారు.

వైభవంగా నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీ ప్రహ్లాద యోగానంద శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను పట్టు వస్త్రాలతో అందంగా అలంకరించి ఎదుర్కోళ మహోత్సవ సంవాదం రక్తికట్టించారు. అనంతరం కల్యాణ తంతు పూర్తిగావించారు. క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు, భక్తులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మోతె : మండలంలోని సిరికొండ, నామవరం, రాఘవాపురం ఎక్స్ రోడ్డు, ఉర్లుగొండ గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, సిరికొండ, సర్వారం సహకార సంఘాల చైర్మన్లు కొండపల్లి వెంకటరెడ్డి, ముప్పాని శ్రీధర్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సీజన్‌లో ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధరతో పాటు, సన్నాలకు బోనస్‌గా రూ.500 అందిస్తుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో సీఈఓలు అనంతరెడ్డి, దోసపాటి ఉపేందర్, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసూదన్ రెడ్డి, డైరెక్టర్లు బొడుపుల పుల్లయ్య, వెంకటరెడ్డి, సిబ్బంది, నాయకులు మామిడి వెంకటేశ్వర్లు, పులి ఈదయ్య, రైతులు కృష్ణారెడ్డి, వెంకన్న, కుప్పిరాజు సతీష్‌బాబు, సీతారాములు, వెంకటరాములు, ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఉర్లుగొండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీధర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

మునగాల : ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే ప్రకటించాలని తపస్ జిల్లా అధ్యక్షురాలు పర్వతం సంధ్యారాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తపస్ ఆధ్వర్యంలో చేపట్టే ఉద్యమ పోస్టర్‌ను మంగళవారం మునగాల మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులతో కలిపి ఆమె ఆవిష్కరించారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పీఆర్సీ గడువు ముగిసి సంవత్సరం దాటినా ఇంతవరకు అమలు చేయలేదన్నారు. కమిషన్ నివేదిక వెంటనే తెప్పించి పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మునగాలలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

కుక్కల సంతతి తగ్గించేందుకు చర్యలు

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీ పరిధిలో కుక్కల సంతతి తగ్గించేందుకు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ యాకుబ్‌పాషా అన్నారు. మంగళవారం పట్టణంలో వీధి కుక్కలను పట్టించి సూర్యాపేటలోని యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) సెంటర్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో కుక్కల సంతతి పెరగకుండా వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, గెల్లి రవి, అమరబోయిన సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వీధి కుక్కలను తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

విద్యుత్ లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి కృషి

హుజూర్‌నగర్ : పట్టణంలో విద్యుత్ లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలోని 3వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో చైతన్య కాలనీ, కామిశెట్టినగర్, గణేష్ నగర్‌లలో లోఓల్టేజీ సమస్య తీరనున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఈ రాంప్రసాద్, ఎల్ఎం జగదీష్, ఎస్.చంద్రశేఖర్, కె.యోహాన్, డి.బాబురావు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

డయేరియా అదుపులోకి వచ్చేవరకు వైద్యశిబిరం



చింతలపాలెంలో వైద్యశిబిరంలో బెడ్లు పరిశీలిస్తున్న వైద్యాధికారులు

హుజూర్‌నగర్ : చింతలపాలెంలో డయేరియా అదుపులోకి వచ్చేంతవరకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నిరంజన్, జిల్లా అంటు వ్యాధుల నివారణ ప్రోగ్రాం అధికారి, డాక్టర్ నాజియా తబుస్సుమ్, జిల్లా ఎపిడమాలజిస్ట్ సతీష్ తెలిపారు. మంగళవారం చింతలపాలెంలో డయేరియా వ్యాధిగ్రస్తులను పరిశీలించారు. డయేరియా నివారణకు ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసి నాలుగు బెడ్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 24 గంటల పాటు వైద్యం అందించేందుకు ఇద్దరు మెడికల్ ఆఫీసర్‌లతో పాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతామని చెప్పారు. 20 టీముల ద్వారా ఇంటింటి సర్వే చేసి డయేరియా వాధిపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. మేళ్లచెరువు వైద్యాధికారి సీతామాలక్ష్మి, చింతలపాలెం ఇన్‌చార్జ్ వైద్యాధికారి డాక్టర్ సచిన్, సీహెచ్‌ఓ వినోద్, హెల్త్ సూపర్‌వైజర్ రాజ్‌కుమార్, ఆర్‌ఐ వాసుదేవరావు, పీఎస్ నాగల్‌మీరా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న బీజేపీ

నేరేడుచర్ల : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం నేరేడుచర్ల మండలం దిర్శించర్లలో నిర్వహించిన సీపీఎం నేరేడుచర్ల పట్టణ మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రజాసమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. జమిలి ఎన్నికలు సమైక్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. ఈ మహాసభలో సీపీఎం నాయకులు పారేపల్లి శేఖర్‌రావు, మొగిలిచర్ల రుద్రమ్మ, కొండపల్లి వరలక్ష్మి, సట్టు శ్రీను, నగేష్ , నాగారపు పాండు, కందగట్ల అనంత్‌ప్రకాశ్, యాకుబ్, సిరికొండ శ్రీను, పల్లె వెంకట్‌రెడ్డి, సైదులు, మర్రి నాగేశ్వర్‌రావు, బ్రహ్మం, వెంకన్న, శ్రీనివాస్‌రావు, రాంమ్మూర్తి, వెంకటేశ్వర్లు, వెంకన్న పాల్గొన్నారు.



దిర్శించర్లలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నాగార్జున్‌రెడ్డి

సంక్షిప్త సమాచారం

రేషన్ బియ్యం పట్టివేత

హుజూర్‌నగర్ (చింతలపాలెం): అక్రమంగా తరలిస్తున్న 2 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని చింతలపాలెం మండలంలోని శోభనాద్రిగూడెంలో మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. ఈ విషయమై ఎస్‌ఐ అంకిరెడ్డిని సంప్రదించగా.. విచారణ చేస్తున్నామని పూర్తి వివరాలు త్వరలో తెలియజేస్తామని చెప్పారు.

సదర్ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ

హుజూర్‌నగర్ : కోదాడ, హుజూర్‌నగర్ సదర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కోదాడలో నవంబర్ 3వ తేదీన నిర్వహించబోయే సదర్ సమ్మేళనం వాల్ పోస్టర్‌ను మంగళవారం హుజూర్‌నగర్‌లో యాదవ కుల పెద్దలు ఆవిష్కరించారు. నియోజకవర్గ యాదవ కు ల పెద్దలు, కమిటీ సభ్యులు, యువకులు, పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం

చిలుకూరు : మండల కేంద్రంలోని కాలువ ఒడ్డున గల అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం చిలుకూరుకు చెందిన దాతల సహకారంతో ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ పూజారి రజనీకాంత్ ఆచార్య ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొడారు వెంకటేశ్వర్లు, సభ్యులు, దాతలు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

నడిగూడెం : ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని రత్నవరంలో నిర్వహించిన ఆ పార్టీ గ్రామ శాఖ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యుడు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, మిట్టగణుపుల ముత్యాలు, ఏనుగుల వీరాంజనేయులు, కన్నెబోయిన సైదులు, ఉప్పలయ్య, శంకర్, వెంకటరాములు పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

నడిగూడెం : నిత్యం ధ్యానం చేస్తే సంపూర్ణ ఆరోగ్యం అభిస్తుందని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ధ్యాన నిపుణుడు దామోదర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయి మందిరం ఆవరణలో ధ్యానంపై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఖమ్మంకు చెందిన ధ్యాన నిపుణురాలు కాటేపల్లి శైలజ, నిర్వాహకులు మోతుక్కూరి శ్రీనివాస్, బజ్జూరి అచ్చిరెడ్డి, నారాయణరెడ్డి, లావూరి బాలాజీ, బుస్సా మహేష్, వీరన్న, అప్పారావు పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి ఘనంగా ఆకుపూజ

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో ఆంజనేయస్వామికి మంగళవారం ఘనంగా ఆకుపూజ నిర్వహించారు. ఆంజనేయస్వామికి పంచామృతాలు, 108 తమలపాకులతో అభిషేకం, ఆకుపూజ, గంధ సింధూరం, మన్యసూక్త పారాయణం, శ్రీరామ, ఆంజనేయ అష్టోత్తర శత నామావళి, అలంకరణ, తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ యరగాని గురవయ్య, ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎంపి లక్ష్మణరావు, అర్చకులు హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది యరగాని కిరణ్‌గౌడ్, గోవిందరెడ్డి, రమేష్, ఉపేందర్, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

పాసుపుస్తకాలు మంజూరులో జాప్యం

మునగాల : రైతులకు పట్టదారు పాసు పుస్తకాలు త్వరితగతిన మంజూరు చేయాలని బీసీ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు గడ్డం లక్ష్మీనారాయణ కోరారు. ఈమేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్‌కు రైతులతో కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గత ప్రభుత్వంలో వ్యవసాయ భూములు రిజిస్ట్రేషన్ చేయించుకుంటే 15 రోజుల వ్యవధిలో పాస్ పుస్తకాలు అందించారని, ప్రస్తుత ప్రభుత్వంలో అధికారులు కొత్త పాసు పుస్తకాలు రైతులకు అందించడంలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు.